క్లుప్తంగా

నేడు రంగడి సన్నిధిలో కృష్ణ జయంతి

నెల్లూరు(బృందావనం) : శ్రీకృష్ణ జయంతి సందర్భంగా నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు రంగనాథస్వామికి, శ్రీకృష్ణస్వామికి తిరుమంజనం జరుగుతుందని దేవస్థానం ఈఓ డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.శివకుమార్‌ఆచారి బుధవారం తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ పురాణ పఠనం, సేవాకాలం, గోపురోత్సవం జరుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ఉట్టి మహోత్సవం, పేట ఉత్సవం జరుగుతాయని వివరించారు.

ఇస్కాన్ మందిరంలో..

మినీబైపాస్‌రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో గురువారం ఉదయం 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, భక్తి గీతాలాపన, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగర పరిధిలో గురువారం నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర పిలుపునిచ్చారు. నగరంలోని బృందావనంలో ఉన్న ఆమె కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్భంగా నగరంలోని కనకమహల్ సెంటర్‌లో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం నుంచి జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు యాత్ర జరుగుతుందన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నగర పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పసుపు పచ్చరంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, గ్రేరంగు జీన్స్ ప్యాంట్ ధరించి సుమారు 30 నుంచి 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి వేదాయపాళెం–నెల్లూరు రైల్వే స్టేషన్‌ల మధ్య కావలి వైపు వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుడిచేతిపై యువన్ అని ఇంగ్లిష్‌లో, ఎడమచేతి మీద కె.ఎం.బి, తల్లీబిడ్డ బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మృతుని వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్‌ఫారమ్‌పై అనారోగ్యంతో..


వృద్ధుడి మృతదేహం

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు బుధవారం అనారోగ్యంతో మరణించాడు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు–పచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుల వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

నేతన్నకు ఆర్థిక సాయం



నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని గాంధీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కవర్తపు ఆనందరావు కిడ్నీ సమస్య వల్ల బాధపడుతుండడంతో పలువురు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మీనారాయణ, సుధాకర్, భాస్కర్, శేషు, పరంధామయ్య కలిసి రూ.5000లను అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీకి చెందిన నందం అశ్వద్ధామ, బాలాజీ, రామనాథం రాజశేఖర్, మధుబాబు, లక్ష్మీనారాయణ, సురేష్, గోపాల్, వేణుగోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కృతజ్ఞతార్పణల పండగ

నెల్లూరు (బందావనం) : నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డొనీ హాలు వార్షిక కృతజ్ఞతార్పణల పండగ ఈనెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చర్చి సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్తుతి కూడిక ప్రత్యేక ఆరాధన, 9న ఉదయం 8 నుంచి సంతోష సహవాసం, ఆటల పోటీలు, క్విజ్ పోటీలు జరుగుతాయని, 10న ఉదయం 9.30 గంటలకు కృతజ్ఞతార్పణల ఆరాధన ఉంటుందని తెలియజేశారు.

దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం తోడ్పాటు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఆలయానికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : సనాతన ధర్మాన్ని కాపాడుకునే విధంగా దేవాలయాల నిర్మాణానికి తమ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బద్దెవోలు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన చెన్నకేశవ స్వామి దేవస్థానంలో కుంభాభిషేక మహోత్సవంలో మంత్రి కాకాణి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ కామన్ గుడ్ ఫండ్ కింద ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కొన్నిచోట్ల ప్రజల భాగస్వామ్యంతో ఆలయాలు నిర్మిస్తున్నామని, నిరుపేదలు ఉన్న దళితవాడల్లో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల నిధులతో ఆలయాల నిర్మాణానికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మనిషి సమస్యల్లో చిక్కుకున్నప్పుడు దేవుని సన్నిధికి వెళ్లి చెప్పుకోవాలని అనుకుంటారని, అందుకోసం ప్రతిచోట దేవాలయం ఉండాలని కోరుకుంటారని తెలిపారు. దేవాలయం ఉన్న గ్రామంలో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కృష్ణాష్టమి శుభాకాంక్షలు

మనుబోలు మండలానికి చెందిన యాదవ సంఘం నాయకులు మంత్రి కాకాణిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం కలిసి శ్రీకృష్ణుని బొమ్మను బహూకరించి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా తమకు సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో యాదవ నేతలు గుమ్మడి వెంకటసుబ్బయ్య, చెందులూరు శ్రీనివాసులు, ఆవుల తులసీరాం, చేవూరు ఓసూరయ్య, ఆవుల వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు, సురేంద్ర పాల్గొన్నారు.


కాకాణికి శ్రీకృష్ణుని బొమ్మను బహూకరిస్తున్న యాదవ నేతలు

మేలు చేసిన వారిని మరువొద్దు


కొత్త పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- పగటి వేషగాళ్లతో జాగ్రత్త
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని నాలుగున్నరేళ్లలో మేలు చేసిన వారిని మరిచిపోవద్దని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలను కోరారు. నూతనంగా మంజూరైన పింఛన్లను బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకోవాలంటే నిత్యం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హత ఉంటే ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజల వద్దకు వస్తున్నారని, అలాంటి పగటి వేషగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలో నూతనంగా మంజూరైన 609 పింఛన్లతో కలిపి ప్రతినెలా రూ.3.28 కోట్లను పింఛన్ల రూపంలో ప్రజలకు అందజేస్తున్నట్లు వివరించారు.

పట్టాల పంపిణీ

మండలంలో 22 మందికి రీసర్వే పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు దామరమడుగులో 749 మందికి, రేబాలలో 970 మందికి పట్టాలు వచ్చాయని, వాటిని కూడా త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్యామ్‌ప్రసాద్, తహసీల్దార్ సుధీర్, పార్టీ నేతలు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిన్నారి రోహిత కృతజ్ఞతలు

స్థానిక సుబ్బారెడ్డినగర్‌కు చెందిన ఉప్పలూరు రోహిత అనే చిన్నారి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి బుధవారం కృతజ్ఞతలు తెలిపింది. స్థానికంగా తన ఇంటి ముందు రోడ్డు లేకపోవడంతో స్కూల్ బస్సు రావడంలేదని ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి రోహిత తీసుకెళ్లింది. వెంటనే అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మించడంతో శాలువా, పూలమాలను తీసుకొచ్చి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్థల దాతృత్వం అభినందనీయం

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు స్థలం దాతృత్వమివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని దామేగుంట చలివేంద్రంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్ రూ.5 లక్షలు, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూ.2 లక్షల నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో గండవరపు వెంకటసుబ్బారెడ్డి స్థలాన్ని దాతృత్వం ఇవ్వడం మంచి పరిణామమన్నారు. అనంతరం డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ దామేగుంటలో గడిచిన నాలుగేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు జరగడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా రూ.5 కోట్లకు పైగా ప్రజలకు అందినట్లు తెలియజేశారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఈ ఎ.రమేష్, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ గాలి జ్యోతి, జెడ్పీటీసీ పసుపులేటి సరోజనమ్మ, సర్పంచ్ హరిత, పార్టీ నేతలు చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, ఆర్.వెంకటేశ్వర్లునాయుడు, ఎ.వెంకటరత్నం పాల్గొన్నారు.

నేడు గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

పొదలకూరు : పట్టణంలోని గీతామందిరంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతాయని మందిర నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి మేలుకొలుపు, 7.30 గంటలకు గీతాపారాయణం, 8 గంటలకు గ్రామ సంకీర్తన, 10 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 11.20 గంటలకు బంగారుపూలతో అష్టోత్తరం, మధ్యాహ్నం 12 గంటలకు మంత్రపుష్పం, 12.15 గంటలకు హారతి, తీర్థప్రసాదాల పంపిణీ జరుగుతుందని తెలియజేశారు. 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు స్వామికి ఊయలసేవ ఉంటుందన్నారు.

బస్‌షెల్టర్లో వ్యక్తి మృతి


తిరుపాల్ మృతదేహం

పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ బస్‌షెల్టర్లో ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. కలువాయి మండలం వెదనపర్తి గ్రామానికి చెందిన కొట్టా తిరుపాల్(40) బస్టాండ్లోని బస్‌షెల్టర్లో పడుకున్నాడు. అక్కడే మరణించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అతిగా మద్యం సేవించి గొంతెండి మృతి చెందాడా? లేక మరేదైనా కారణమా అనే దానిపై ఎస్సై కరిముల్లా విచారణ చేపట్టారు. తిరుపాల్ బంధువులకు సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

సైన్స్ అధ్యాపకుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న మోహన్‌రావు

కోవూరు : మండలంలోని ఇనమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్సు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.మోహన్‌రావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇనమడుగు ప్రభుత్వం జూనియర్ కళాశాల సిబ్బంది బుధవారం ఆయనకు అభినందనలు తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారి ఆలయం వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటనపై బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. సంగం గ్రామానికి చెందిన ఈర్ల శివశంకర్ అనే యువకుడు అమ్మవారి దర్శన నిమిత్తం ఈనెల 5వ తేదీన తన పల్సర్ బైక్‌పై వచ్చి ఆలయం వెనుక భాగాన బైక్‌ను పార్కు చేసి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. దర్శనం ముగించుకుని తిరిగి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో గాలింపు చేపట్టాడు. అయితే బైక్ ఆచూకీ తెలియకపోవడంతో తమకు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

కసుమూరులో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో మతిస్థిమితంలేని వ్యక్తి గత రెండు రోజుల నుంచి హల్‌చల్ చేస్తున్నాడు. స్థానికులు, ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నాడు. కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు సమీపంలోని దుకాణాల వద్ద మంగళవారం సాయంత్రం మతిస్థిమితం లేని వ్యక్తి పెద్దగా కేకలు వేస్తూ, ప్రయాణికులను భయపెట్టాడు. దర్గాకు వచ్చిన ఓ భక్తుడి సెల్‌ఫోన్‌ను లాక్కోవడంతో స్థానికులు చుట్టుముట్టి సెల్‌ఫోన్‌ను తీసుకున్నారు. అనంతరం అతన్ని చెరువు కట్టపైకి తీసుకెళ్లి వదిలారు. అయితే బుధవారం సాయంత్రం కూడా ఆ వ్యక్తి దుకాణాల వద్దకు వచ్చి హల్‌చల్ చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

అమ్మకానికి సిద్ధంగా..


ప్రత్యేక ఆకర్షణగా ఉన్న వినాయకుని ప్రతిమ


గణనాథుని శిరస్సుపై శివుడు

- గణనాథుల ప్రతిమలకు పెరిగిన డిమాండ్
- కనిపించని మట్టి ప్రతిమలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

పొదలకూరు : ఎప్పటిలానే ఇప్పుడు కూడా వినాయక ప్రతిమలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తోనే తయారు చేస్తున్నారు. చూద్దామన్నా మట్టి వినాయకుని ప్రతిమలు కనిపించడం లేదు. ఆకృతులు సక్రమంగా రాకపోవడం, ఎక్కువ కాలం ఉండకపోవడం వల్ల తయారీదారులు మట్టి ప్రతిమలను రూపొందించడం లేదు. పొదలకూరులో తయారు చేస్తున్న గణనాథుని విగ్రహాల అమ్మకాల్లో పోటీ పెరిగింది. తయారీదారులు గతంలో మాదిరిగా ఆదాయాలు ఉండడం లేదంటున్నారు. దీనికితోడు వస్తు ఆధారిత పన్ను(జీఎస్టీ) ప్రతిమల తయారీ ముడిసరుకులకు వర్తించడంతో బొమ్మల తయారీ వ్యయం పెరిగి ప్రతిమల కొనుగోలు ధరలు పెరిగాయి. గ్రామగ్రామాన విఘ్నేశ్వరుని విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నందున బొమ్మలకు డిమాండ్ బాగా ఉంది. ఆరుమాసాల పాటు తయారీదారులు కష్టించి పనిచేస్తే వినాయకచవితికి గ్రామాల్లో భక్తులకు బొమ్మలను అందించగలరు. కొందరు ఉత్సవ కమిటీ సభ్యులు పండగకు రెండు, మూడు మాసాలు ముందుగానే తమకు కావలసిన బొమ్మ డిజైన్ను అందజేస్తే తయారీదారులు ఆ మేరకు విగ్రహాన్ని అందించే వెసులుబాటు కూడా ఉంది. కాగా పట్టణంలోని పద్మావతినగర్‌లో బొమ్మలను సృజనాత్మకతతో ప్రతిఏటా వివిధ రకాల ఆకృతులతో తయారు చేస్తున్నారు. ఎలుక వాహనంపైనే కాకుండా రకరకాల పక్షులు, జంతులను కూడా విఘ్నేశ్వరుని వాహనంగా ఉపయోగిస్తున్నట్లు బొమ్మలను రూపొందిస్తున్నారు. పెరిగిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సున్నం, ఇతర ముడిపదార్థాలు, రంగులు వేసేందుకు అందించే కాంట్రాక్టు తదితర లెక్కలు చూసుకుని ధరలను నిర్ణయిస్తున్నట్లు తయారీదారులు వెల్లడించారు.

బొమ్మల తయారీలో పెరిగిన పోటీ

ఈనెల 18న వినాయక చవితి పండగకు బొమ్మల తయారీలో పోటీ పెరిగింది. పండగ సమీపిస్తున్నందున తయారీదారులు ప్రతిమలు రూపకల్పనలో వేగం పెంచారు. ఈ ఏడాది రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన తయారీలుదారులు అమ్మకాలు ఎలా ఉంటాయోనని యోచిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు


మనుబోలు : శ్రీకృష్ణుడు-గోపికల వేషధారణలో చిన్నారులు


ముత్తుకూరు : అదానీ వరల్డ్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి

ముత్తుకూరు : శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలో బుధవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ముత్తుకూరు, మల్లూరు, కృష్ణపట్నం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఈపూరు, నేలటూరు తదితర గ్రామాల్లోని కృష్ణ మందిరాలు, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఆచరించారు. మల్లూరులో మూడు రోజుల ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో కృష్ణాష్టమి పండగ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, స్కూల్‌కు హాజరయ్యారు. స్కూల్‌లో ఉట్టి వేడుకలు జరిపించారు.


మనుబోలు : ఉట్టి కొడుతున్న చిన్నారులు

- **మనుబోలు :** మండలంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తులు బుధవారం వేడుకగా జరుపుకున్నారు. మనుబోలులోని పలు ఆలయాల వద్ద చిన్నారులు ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఉట్టి కొట్టారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము ట్యాబ్లెట్‌తో కృష్ణుని సూక్ష్మ రూపాన్ని తయారు చేశాడు. పిడూరుపాళెంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారలతో చిన్నారులు సందడి చేశారు.
- **బుచ్చిరెడ్డిపాళెం :** నగర పంచాయతీ పరిధిలోని గిరిజాహాల్ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణ పారాయణం, గీతా ప్రచారకులతో ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. కాగా పలు గ్రామాల్లో చిన్నారులకు కృష్ణుని అలంకరణ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సురమౌళి, చిరమణ సురేష్‌బాబు, కృష్ణ, శ్రీనివాసులు, వెంకటరమణ, ఏడుకొండలు, ప్రదీప్ పాల్గొన్నారు.


మనుబోలు : ట్యాబ్లెట్‌పై కృష్ణుని రూపం


బుచ్చిరెడ్డిపాళెం: ప్రత్యేక పూజల్లో భక్తులు


బుచ్చిరెడ్డిపాళెం: కృష్ణుని వేషధారణలో చిన్నారి

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామానికి చెందిన వివాహిత కూని స్వప్న అదృశ్యంపై ఆమె భర్త ప్రవీణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన ప్రవీణ్ పనినిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా భార్య స్వప్న కనపడలేదు. దీంతో గ్రామంలో విచారించాడు. అంతేకుండా బంధువుల గ్రామాలకు వెళ్లి గాలించాడు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య అదృశ్యంపై గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన నిజాముద్దీన్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో నిజాముద్దీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.